www.aakshitha.com

People's voice

అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

గురువారం | 12 | మార్చి | 2026 | పేజీలు: 08



## జనాభా అన్నింటికి ప్రామాణికం

### కలెక్టర్ చంద్ర శేఖర్



నల్గొండ, అక్షిత ప్రతినిధి : జనాభా అన్నింటికీ ప్రామాణికం అని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో 2027 జనగణన పై ఏర్పాటు చేసిన 3 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఒక దేశానికి జనగణన అతి ముఖ్యమని, ముఖ్యంగా దేశ అభివృద్ధి జనాభా పైనే ఆధారపడి ఉంటుందని, ప్రజలకు అవసరమైన పథకాల రూపకల్పనలో, అలాగే ఇతర అంశాలలో జనాభా కీలక పాత్ర వహిస్తుందని అన్నారు. అన్నింటికీ ప్రామాణికం జనాభానే అని, ఆ ప్రాంత జనాభాను బట్టి నిధుల కేటాయింపు, అభివృద్ధి ఆధారపడి ..మిగతా 2లో



## ప్రతి నిరుపేదకు

# స్వంతిల్లు





వెలుగుమట్లకు స్వంతింటి వెలుగులు

డిసెంబర్ 9 న సీఎం చేతుల మీదుగా గృహ ప్రవేశాలు

డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, తుమ్మల

దళారులకు చెక్ అర్హులకు అండగా సర్కార్

వెలుగుమట్ల భూ నిర్వాసితుల్లో అర్హులకు ఇళ్ల పట్టాలు ఇందిరమ్మ ఇండ్లు

311 మందికి భూదాన్ భూమిలో భూమి పట్టాతో పాటు ఇందిరమ్మ ఇండ్లు

101 మంది అర్హులకు వారి సొంతూర్లలో ఇందిరమ్మ ఇండ్లు

వెలుగుమట్ల భూ నిర్వాసితుల్లో అర్హులకు పట్టాలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేసిన డిప్యూటీ సీఎం మంత్రులు

ఖమ్మం/అక్షిత బ్యూరో : డిసెంబర్ 9 న సోనియాగాంధీ పుట్టిన రోజు సందర్భంగా వెలుగుమట్ల భూదాన్ భూముల లబ్ధిదారులు సామూహిక గృహప్రవేశం జరుపుకోవాలని ఆ దిశగా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన అవసరమైన చర్యలు చేపడుతుందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తుమ్మల నాగేశ్వరరావులు తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిప్యూటీ ..మిగతా 2లో

## డంపు యార్డు సమస్యకు చెక్

### రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



కరీంనగర్ అక్షిత బ్యూరో : నగరంలోని డంపు యార్డు ప్రజలకు పెద్ద సమస్యగా మారిందని, త్వరలోనే డంపు యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పోన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కరీంనగర్ నగర పాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ ..మిగతా 2లో

## అతివలకు అందలం

మహిళా సాధికారత లక్ష్యం

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు





యాదాద్రి భువనగిరి, అక్షిత న్యూస్ : జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ముఖ్య అతిథిగా హాజరై జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తి, మున్సిపల్ చైర్మన్ తంగేళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్, వైస్ ఛైర్మన్ పోతంశెట్టి మంజుల తో కలిసి ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమైనదని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ చూపుతూ ముందుకు సాగుతున్నారన్నారు. మహిళల సాధికారత కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ ..మిగతా 2లో

## అతివలకు అందలం

**మొదటి పేజీ తరువాయి...**

కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. జిల్లాలో మహిళల అభివృద్ధి, భద్రత మరియు సాధికారత కోసం అధికారులు సమిష్టిగా పని చేస్తున్నారని అన్నారు. మహిళలు విద్య, ఉపాధి మరియు స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకొని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ,జిల్లా సంక్షేమ అధికారి నర్సింహా రావు, డీపీఆర్ఓ అరుంధతి, పౌర సరఫరాల అధికారి రోజా రాణి, ఇతర జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా మహిళలను సత్కరించి అభినందించారు.

## జనాభా అన్నింటికి ప్రామాణికం

**మొదటి పేజీ తరువాయి...**

ఉంటుందని, అందువల్ల జన గణను అందరూ సీరియస్ గా తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత మొదటిసారిగా జన గణన చేపట్టడం జరుగుతున్నదని, జనగణనకై ప్రభుత్వం జారీ చేసిన నియమ నిబంధనలు, హ్యాండ్ బుక్స్ అన్నిటిని జాగ్రత్తగా చదువుకోవాలని చెప్పారు. జనగణన రెండు విభాగాలుగా నిర్వహించడం జరుగుతుందని, కుటుంబాలు, మనుషుల లెక్కలు సేకరించడం జరుగుతుందన్నారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ మాట్లాడుతూ తహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు చార్జ్ ఆఫీసర్లుగా ఉన్నందున సరైన వ్యక్తులను సూపర్వైజర్లుగా నియమించాలని, ఆరుగురు ఎన్యూమరేటర్లకు ఒక సూపర్వైజర్ ను నియమించాలని, మార్చి 31 నాటికి వీరిని నియామకం పూర్తిచేయాలని, అలాగే ఈ నెల 12లోగా టెక్నికల్ అసిస్టెంట్లను నియమించాలని, ఈనెల 21 నుంచి 23 వరకు టెక్నికల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి 600 నుండి 700 జనాభాకు ఒక ఏన్యూమరేటర్ ను నియమించడం జరుగుతుందని ఆయన వెల్లడించారు.

రాష్ట్ర సెన్సెస్ డైరెక్టర్ కార్యాలయ జాయింట్ డైరెక్టర్ రఘు మాట్లాడుతూ జన గణనలో సూపర్వైజర్ తో పాటు, ఎన్యూమరేటర్లు, చార్జ్ ఆఫీసర్ల పాత్ర కీలకమని అన్నారు. జనగణనను ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్వహించేందుకు ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలని, 2011లో నిర్వహించిన జనగణన 16 సంవత్సరాల తర్వాత తిరిగి ఇప్పుడు నిర్వహించడం జరుగుతున్నదని, ఈ విడత యాప్ లో ఎన్యూమరషన్ చేయడం జరుగుతుందని, సూపర్వైజర్లు కూడా ఆన్లైన్లోనే వీటిని సరి చూసుకోవచ్చు అని, పోర్టల్ లో డీటెయిల్స్ అన్ని నమోదు చేయవలసి ఉంటుందని, జనగణన డేటా కరెక్ట్ గా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తాసిల్దార్లు, తదితరులు ఉన్నారు.

## డంపు యార్డు సమస్యకు చెక్

**మొదటి పేజీ తరువాయి...**

సుడా చైర్మన్కోమటిరెడ్డి నరెంధర్ రెడ్డి, పలువురు కార్పోరేటర్లతో కలిసి ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్ నగరపాలక సంస్థ డంపింగ్ యార్డును సందర్శించారు. డంపుయార్డులో బయోమైనింగ్ ప్రక్రియను యంత్రాల పనితీరును తనిఖీ చేసి పరిశీలించారు. ప్రస్తుతం పేరుకు పోయిన చెత్త టన్నుల వివరాలు,డంపు యార్డు ప్రక్షాళన చర్యలపై కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ ని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. డంపుయార్డు ప్రక్షాళన వేగవంతం చేసి స్థానిక ప్రజల ఇబ్బందులు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కమీషనర్, అధికారులను ఆదేశించారు. ఈ సంధర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పెద్ద నగరాల్లో చెత్త సేకరణ వ్యర్థాల తరలింపు సమస్యగా మారిందని రాష్ట్ర ప్రభుత్వం వీటి ప్రక్షాళనకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇటీవల కరీంనగర్ జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న డంపింగ్ యార్డు సమస్యను తీసుకువెళ్లడం జరిగిందని, డంపు యార్డు తొలగింపుకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. డంపుయార్డు తొలగింపు ప్రక్రియపై నుంచి హామీ ఇచ్చిన అంశాన్ని తొందరగా అమలు చేస్తూ ప్రతి రోజు వచ్చే చెత్తను పేరుకు పోయిన 4 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను ప్రాసెస్ చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతి రోజు వచ్చే చెత్తను కూడ ఎప్పటికప్పుడు బయోమైనింగ్ ప్రక్రియ చేసేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు.

# ప్రతి నిరుపేదకు స్వంతిల్లు

**మొదటి పేజీ తరువాయి...**



సీఎం భట్టి విక్రమార్క రెవెన్యూ హౌజింగ్ సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వ్యవసాయ మార్కెటింగ్ సహకార చేనేత జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు వెలుగుమట్ల భూ నిర్వాసితుల్లో అర్హులకు పట్టాలు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇంట్లు ఉండాలని నిర్ణయం తీసుకుని తమ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. హౌసింగ్ శాఖ ద్వారా 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లను 22 వేల 500 కోట్లతో మంజూరు చేశామన్నారు. ప్రతి వారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం బిల్లులు విడుదల చేస్తుందని తెలిపారు. పేదలకు న్యాయం జరగాలనే ఉద్దేశ్యంతో పనిచేస్తున్న ప్రభుత్వంపై కొంత మంది కావాలని బురద చల్లుతున్నారని తెలిపారు. పేదల నిస్సహాయత ఆసరాగా తీసుకొని సమాంతరమైన వ్యవస్థ ఏర్పాటు చేసి త్రాగునీరు బడి విద్యుత్ సదుపాయం వంటి సౌకర్యాలు లేకుండా పేదలు భయం లోనే బ్రతికేలా విష వలయం పన్నారని డిప్యూటీ సీఎం అన్నారు. పేదలు ఆత్మగౌరవంతో జీవించాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం నేడు పట్టాలు అందిస్తుందని అన్నారు. పేదల కోసం పనిచేస్తున్న ప్రభుత్వంపై కొంతమంది కావాలని దురుద్దేశంతో సామాజిక మాధ్యమాలలో విష ప్రచారం చేస్తున్నారని ఎవరు ఏం ప్రచారం చేసిన పేదలకు న్యాయం జరగాలని అంతిమ లక్ష్యాన్ని సాధించే దిశగా తాము పని చేస్తున్నట్లు తెలిపారు. రాజకీయ దురుద్దేశాలు ప్రభుత్వాన్ని విమర్శించారు అనే పట్టింపులు లేకుండా అర్హులైన 412 మంది నిరుపేద కుటుంబాలకు ఒకేసారి ఇందిరమ్మ ఇండ్లను నేడు మంజూరు చేస్తున్నామని తెలిపారు. పేదలను అనేకమంది అనేకసార్లు వచ్చి బెదిరించే వారని భయాందోళనల మధ్య గతంలో వారు గడిపారని ఆ పరిస్థితికి నేడు ప్రజా ప్రభుత్వం స్వస్తి పలికిందని తెలిపారు. ప్రభుత్వం అందించిన పట్టాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం భూమి పూజ కార్యక్రమం గురువారం జరుపుకోవాలని ఆయన సూచించారు. డిసెంబర్ 9 న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఇతర మౌళిక వసతులు పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహించు కోవాలన్నారు. పేదల పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న కమిట్మెంట్ ను పది సంవత్సరాల పాటు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరిట మోసం చేసిన ప్రతిపక్షాలు ప్రశ్నించడం హాస్యాస్పదమని, ప్రభుత్వాన్ని ప్రశ్నించే అర్హత తమకు ఉందా అని ఆత్మవిమర్శ చేసుకోవాలని డిప్యూటీ సీఎం హితవు పలికారు. పేదల నిస్సహాయతను ఆసరాగా చేసుకుని డబ్బులు వసూలు చేసిన ప్రతి ఒక్కరికి కఠిన శిక్ష పడేలా చూస్తామని ప్రతి ఒక్క రూపాయి నిందితుల నుంచి వసూలు చేసి బాధితులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రపంచ స్థాయి పోటీలకు సన్నద్ధమయ్యే విధంగా మన విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాలను నిర్మిస్తుందని తెలిపారు. వెలుగు మట్ల భూదాన్ భూములలో పేదలకు పంచగా మిగిలిన భూమిలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ స్కూల్స్ పక్క భవనాలకు ఆ స్థలం ఉపయోగిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు.

వెలుగుమట్ల లబ్ధిదారులు నేటి నుంచి నిర్భయంగా ఉండాలని మోడల్ కాలనీగా తయారు చేసి అందించే బాధ్యత తాము తీసుకుంటామని తెలిపారు. పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ మార్చి 1 2026 నాడు ఇచ్చిన మాట ప్రకారం నిరుపేదలైన లబ్ధిదారులకు సీఎం కేబినెట్ సహచరుల సహకారంతో 311 మంది ఇంటి స్థలం లేని వారికి ఇండ్ల పట్టాలు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రం, సొంత ఊరిలో స్థలం ఉన్న మరో 101 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లను ఎటువంటి భేషజాలు లేకుండా ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఫిబ్రవరి 24న వెలుగుమట్ల ఇండ్ల కూల్చివేతలు జరిగిన తర్వాత ప్రధాన ప్రతిపక్ష నాయకులు వచ్చి మొసలి కన్నీరు కార్చారని మంత్రి ఎద్దేవా చేశారు. 2023 జూలై నెలలో ఎన్నికల కంటే ముందు వెలుగు మట్ల ప్రాంతంలో కూల్చివేతలకు గత ప్రభుత్వం పాల్పడింది వాస్తవం కాదా 9 సంవత్సరాలుగా పేదలు ఎటువంటి వసతులు లేకుండా నివసిస్తుంటే చూస్తూ ఊరుకున్నారు తప్ప ఎటువంటి పట్టాలు పంపిణీ చేయలేదని తెలిపారు. పది సంవత్సరాలు రాష్ట్రాన్ని పరిపాలించే సమయంలో పేదలకు పట్టాలు ఇవ్వాలనే బుద్ధి జ్ఞానం ఎందుకు రాలేదని మంత్రి విమర్శించారు. గత పాలకులకు విశాల హృదయం లేదని తమ ప్రభుత్వం ప్రజల కష్టాలను చూసి చలించి నేడు పట్టాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం గురించి మాట్లాడే నైతిక హక్కు ప్రతిపక్షానికి లేదని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నాయకులు మా ప్రభుత్వం వస్తుందని పగటి కలలు కంటున్నారని అనేక ఎన్నికల ఫలితాలు వస్తున్నప్పటికీ మార్పు చెందకుండా కక్ష పూరిత మనస్తత్వంతో ప్రవర్తిస్తున్నారని అన్నారు. 10 సంవత్సరాల పాటు పేదలను పట్టించుకోలేదని ప్రస్తుత ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు పేదలకు ఇస్తుందని అన్నారు. త్రాగునీరు రోడ్డు ఫంక్షన్ హాల్ షాపింగ్ కాంప్లెక్స్ స్కూల్ విద్యుత్ సరఫరా వంటి అనేక మౌళిక వసతుల వసతుల పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని అన్నారు. గత 8 సంవత్సరాలుగా పేదలు ఇబ్బందులు పడిన మాట వాస్తవమేనని ఆ సమస్యలకు నేడు పరిష్కారం లభిస్తుందని అర్హులైన బాధితులు ఎవరైనా ఇంకా మిగిలి ఉంటే వారికి కూడా తమ ప్రభుత్వం తప్పని సరిగా ఇండ్లు మంజూరు చేస్తుందని అన్నారు. పేదలను మోసం చేసి దళారులు వసూలు చేసిన డబ్బు ఒక్క రూపాయి కూడా వదలకుండా పూర్తి స్థాయిలో వసూలు చేసి బాధితులకు అందించాలని మంత్రి పోలీస్ కమీషనర్ ను ఆదేశించారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ పేదలను కొంత మంది ముఠాగా ఏర్పడి మోసం చేస్తే గత పాలకులు పట్టించుకోలేదన్నారు. తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు పేరిట ఇచ్చిన పత్రాలు బోగస్ అని సిసిఎల్ఏ ఆ భూములు స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. లాటీ ఛార్జ్ లేకుండా అక్రమ నిర్మాణాలు కూల్చివేసి దగా కోరులను తరిమివేశామని మంత్రి తెలిపారు. నిరుపేదలకు వెలుగు మట్ల భూదాన్ భూములలో భూ పట్టాలు పంపిణీ చేస్తున్నామని పిల్లల భవిష్యత్తు కోసం ఇక్కడ మోడల్ స్కూల్ నిర్మిస్తామని చెప్పారు. యుద్ధ ప్రాతిపదికన రహదారులు విద్యుత్ మంచి నీరు రోడ్లు డ్రైయిన్ వంటి మౌళిక వసతుల కల్పన పనులు పూర్తి చేస్తామన్నారు. డిసెంబర్ 9న సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి ని తీసుకువచ్చి భూ దాన్ భూములలో నూతనంగా చేపట్టే 311 మంది లబ్ధిదారుల కాలనీ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. నిరుపేదలకు న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో కొంత ఇబ్బంది పడటం జరిగిందని ఆయన తెలిపారు. అనధికారికంగా నిరుపేదలు నివసించే దుస్థితి రాకుండా అవసరమైన మౌళిక వసతులు కల్పిస్తామని అన్నారు. 311 మంది లబ్ధిదారులే కాకుండా మరో 101 మంది నిరుపేదలకు వారి సొంత ఊరిలో ఉన్న స్థలంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసామని అన్నారు. చివరి లబ్ధిదారుడి వరకు ఇండ్లు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెలుగుమట్ల కాలనీ అద్భుతంగా తీర్చి దిద్దుతామని, పేదల దగ్గర డబ్బులు వసూలు చేసిన దళారుల వివరాలు పోలీసులకు అందించాలని వారికి కఠిన శిక్ష పడేలా చూస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ వెలుగు మట్ల భూదాన్ భూములకు సంబంధించి పెద్ద భూ మాఫియా నడుస్తుందని ప్రజల దగ్గర నుంచి డబ్బులు వసూలు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. 311 మంది నిరుపేదలకు పట్టాలు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేదలు నివసించే కాలనీలో ఇండ్లతో పాటు పార్క్ రోడ్డు స్కూలు విద్యుత్తు త్రాగు నీరు వంటి మౌళిక సదుపాయాల పనులు కూడా వేగవంతంగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. ప్రత్యేక కేసు క్రింద పరిగణించి ఇంటి నిర్మాణానికి మంజూరు చేసే నిధులు పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ వెలుగుమట్ల భూదాన్ భూముల నిర్వాసితుల బాధితులలో పారదర్శకంగా చేపట్టిన సర్వే ద్వారా అర్హులుగా గుర్తించిన 311 మంది లబ్ధిదారులకు నేడు డిప్యూటీ సీఎం, మంత్రుల చేతుల మీదుగా వెలుగు మట్లలో ఇంటి స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నామన్నారు. వెలుగుమట్ల భూదాన్ భూములలో లేఔట్ వేసి 311 ప్లాట్ లు చేశామని లబ్ధిదారులకు పారదర్శకంగా సాఫ్ట్ వేర్ తో మానవ ప్రమేయం లేకుండా ర్యాండమైజేషన్ ద్వారా ప్లాట్ లు కేటాయించామని తెలిపారు. 1953 రికార్డుల ప్రకారం 147, 148, 149 సర్వే నెంబర్ లో 31 ఎకరాల 7 గుంటల భూమిని రాజా రామారావు భూదాన్ ఉద్యమంలో దానం చేశారని తెలిపారు. ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ 2014లో కల్తీ రామ చంద్రయ్య ముత్తయ్య కల్లూరి కృష్ణ బాబురావు ఇతరులు ఇలా 21 మంది సభ్యులు కలిసి ఒక సంఘం తయారు చేసి భూదాన్ భూములను కబ్జా చేసి పేదల దగ్గర నుంచి 30 వేల నుంచి మూడు లక్షల రూపాయల వరకు వసూలు చేసి భూమి పట్టాలు ఇస్తామని ఆక్రమణలు చేయించారని వీరిపై ఇప్పటివరకు 26 కేసులు నమోదు చేసి 11 మందిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. కల్లూరు కృష్ణ ఇంటిలో చేపట్టిన తనిఖీ లలో మూడు కోట్ల రూపాయల వరకు పేదల నుంచి వసూలు చేసినట్లు ఆధారాలు లభించాయని వీరి ఆస్తులు వివరాలు సేకరించి వాటి ద్వారా పేదల నుంచి వసూలు చేసిన డబ్బు రికవరీకి ప్రయత్నం చేస్తామని సిపి తెలిపారు.

# తాగునీరు సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి

**పూర్తిగా శుద్ధితో సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి**

**రానున్న వేసవిలో త్రాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి**

**జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**



**నాగర్ కర్నూలు అక్షిత ప్రతినిధి:** ప్రజల ఆరోగ్య జీవన ప్రమాణాలు మెరుగుపడేలా గ్రామాలు, పట్టణాల్లో నివసించే ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా ప్రతిరోజూ అందించే త్రాగునీరు సురక్షితంగా ఉండేలా పూర్తిస్థాయిలో శుద్ధి చేసి సరఫరా చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం కల్వకుర్తి పట్టణంలోని మిషన్ భగీరథ గ్రిడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 60 ఎమ్ఎల్‌డీ సామర్థ్యం గల నీటి శుద్ధి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా త్రాగునీటి శుద్ధి ప్రక్రియ, నీటి శుద్ధి కేంద్రం పనితీరును సమగ్రంగా కలెక్టర్ పరిశీలించారు. నీటి శుద్ధి కేంద్రంలో నిర్వహిస్తున్న నీటి నాణ్యత పరీక్షలను కలెక్టర్ పరిశీలించి అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. శుద్ధి ప్రక్రియలో పాటిస్తున్న విధానాలు, నీటి నిల్వ ట్యాంకులు, ఫిల్టరేషన్ వ్యవస్థ, ల్యాబ్‌లో నిర్వహిస్తున్న పరీక్షల సామర్థ్యం తదితర అంశాలపై కలెక్టర్ అధికారులతో చర్చించారు. నీటి నాణ్యతపై ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తూ ప్రజలకు అందే త్రాగునీరు పూర్తిగా సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...., త్రాగునీటి శుద్ధి ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ నీటి నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ప్రజలకు అందించే త్రాగునీరు పరిశుభ్రంగా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా త్రాగునీటి సరఫరాలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతిరోజూ నిర్వహించే నీటి పరీక్షల నివేదికలను క్రమం తప్పకుండా నమోదు చేసి భద్రపరచాలని కలెక్టర్ సూచించారు. అలాగే రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని త్రాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కల్వకుర్తిలోని 60 ఎమ్ఎల్‌డీ సామర్థ్యం గల ఈ నీటి శుద్ధి కేంద్రం ద్వారా ప్రతిరోజూ కల్వకుర్తి మరియు అచ్చంపేట నియోజకవర్గాల్లోని సుమారు 460 గ్రామాలకు, అలాగే కల్వకుర్తి మున్సిపాలిటీకి రోజుకు సుమారు 50 మిలియన్ లీటర్ల త్రాగునీరు సరఫరా చేస్తున్నట్లు అధికారులు జిల్లా కలెక్టర్కు వివరించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఆర్డీవో జనార్ధన్ రెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల, వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్, కల్వకుర్తి మున్సిపల్ కమిషనర్ అహ్మద్ హుస్సేన్, మిషన్ భగీరథ ఏఈ సంతోష్, తాహసిల్దార్ ఇతర అధికారులు సంబంధిత శాఖల అధికారులు, మిషన్ భగీరథ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# తోటి మిత్రునికి అండగా నిలిచిన పూర్వ విద్యార్థులు

**రూ.70,000వేల ఆర్థిక సహాయం**

**నాగర్ కర్నూలు అక్షిత ప్రతినిధి:** లింగాల మండల కేంద్రానికి చెందిన ఎం.ఏ. ఖాలిద్ మోటార్ మెకానిక్ ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న విషయం తెలిసిన పదవ తరగతి 1990--91 బ్యాచ్‌కు చెందిన మిత్రులు మానవత్వం చాటుకున్నారు. బుధవారం ఖాలిద్ నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని పరామర్శించారు. చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుసుకున్న మిత్రులు తమ వంతు సహాయంగా రూ.7,0000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పాత మిత్రుడిగా ఖాలిద్ ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని బాధ కలిగిందన్నారు. అతను త్వరగా కోలుకొని మామూలు జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. అవసరమైతే భవిష్యత్తులో కూడా తమ సహాయ సహకారాలు కొనసాగిస్తామని తెలిపారు. స్నేహం అంటే కష్టసమయంలో ఒకరికి ఒకరు తోడుగా నిలవడమేనని వారు పేర్కొన్నారు. ఖాలిద్ కుటుంబ సభ్యులు మిత్రులు అందించిన సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు. వారి అండతో చికిత్స కొనసాగించేందుకు ధైర్యం కలిగిందన్నారు. ఈ



కార్యక్రమంలో నసీర్ ఖాన్ కరీమొద్దీన్ శ్రీనివాసులు సీతారాం పీడీ ఎల్లేష్ శోభరాణి పురుషోత్తం డా. రాజేందర్ ప్రేమలత సత్యరాణి తిరుపతయ్య వసీం అనిత హతిరాం అనంద్ దేవేందర్ రాజేశ్వరీ విజయలక్ష్మి శ్రీనివాసులు అశోక్ శ్రీగౌడ్ ఉమాపతి ఈదయ్య విష్ణుగౌడ్ గుత్తి మల్లయ్య సీతారాంటీచర్ తిరుపతమ్మ పోలా ఉమా పద్మ శ్రీకాంత్ ప్రకాష్ లింగమ్మ మాలిక్ బాలమశయ్య దారారంశంకర్ గుంజిరమేష్ నల్లగొండప్రమీల చిన్నయ్య బడే మియా ధారారంశ్రీను గిరిజ బుచ్చయ్య నాగమణి శ్రీధర్ రావు గౌస్. భాను శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ పనులను పరిశీలించిన డిప్యూటీ మేయర్





**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** బుధవారం 99 రోజుల కార్యక్రమం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా నిర్వహించిన మార్నింగ్ వాక్ సందర్భంగా 47వ డివిజన్ మరియు 48వ డివిజన్‌లలో అండర్ డ్రైనేజీ పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించిన మహబూబ్ నగర్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి ఈ సందర్భంగా 47 మరియు 48 డివిజన్‌లలో అండర్ డ్రైనేజీ సమస్యలు ఎక్కువగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుసుకొని, సంబంధిత అధికారులతో పాటు డిఇ, ఏఇ, లతో చర్చించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ కార్పొరేటర్ ఆవేజ్ , 48వ డివిజన్ కార్పొరేటర్ సువర్ణ కిషన్ నాయక్ , మున్సిపల్ సిబ్బంది మరియు డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# బైంసాలో ప్రజల ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ జానకి షర్మిలలి

**గ్రీవెన్స్ డేలో 11 మంది అర్జిదారుల వినతులు స్వీకరణ**

**ప్రతి ఫిర్యాదుపై తక్షణ చర్యలకు ఆదేశాలులి**





**నిర్మల్ అక్షిత బ్యూరో:** నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ బుధవారం భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొని ప్రజల ఫిర్యాదులను స్వీకరించారు. భైంసా సబ్ డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 11 మంది అర్జిదారుల వినతులను స్వీకరించి, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించారు. ఈ సందర్భంగా ఫిర్యాదు దారుల సమక్షంలోనే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడిన ఎస్పీ, బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**షీ టీం ద్వారా కుటుంబ సమస్యల పరిష్కారం:**

కార్యక్రమంలో వచ్చిన కొన్ని కుటుంబ వివాదాలపై షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ ద్వారా కొన్ని కుటుంబాలు తిరిగి కలుసుకోవడం జరిగింది. ప్రజలు నిర్మల్ వరకు వెళ్లడం కష్టంగా ఉండటంతో భైంసాలోనే కౌన్సిలింగ్ ఏర్పాటు చేయడం పట్ల బాధితులు ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.

**పెండింగ్ ఫిర్యాదులపై సమీక్ష:**

గతంలో గ్రీవెన్స్ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితిని కూడా ఎస్పీ సమీక్షించారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న కేసులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

## జీడిమెట్ల వైష్ణోయి ఎంక్లేవ్‌లో నూతన కాలనీ పార్క్ ప్రారంభం

**ప్రజల జీవన ప్రమాణాల పెంపు మా ప్రధాన లక్ష్యం: ఎమ్మెల్యే కెపి వివేకానంద్**

**రూ.50 లక్షలతో పార్క్ నిర్మాణం**



**అక్షిత న్యూస్ / గాజులరామారం:** ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు, కాలనీలలో మౌలిక వసతుల అభివృద్ధికి మరింత ప్రాధాన్యం ఇస్తున్నామని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ పేర్కొన్నారు. జీడిమెట్ల డివిజన్‌లోని వైష్ణోయి ఎంక్లేవ్‌లో రూ. 50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన కాలనీ పార్కును ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు కాలనీల్లో పార్కుల అభివృద్ధి కీలకమని అన్నారు. గత 12 సంవత్సరాల కాలంలో కోట్లాది రూపాయల నిధులను వెచ్చించి జీడిమెట్ల డివిజన్‌తో పాటు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపరిచామని వివరించారు. రోడ్లు, పార్కులు, డ్రైనేజీ వ్యవస్థ, ఇతర సదుపాయాల అభివృద్ధి ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇక రానున్న రోజుల్లో కూడా నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా కృషి కొనసాగిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైష్ణోయి ఎంక్లేవ్ కమిటీ సభ్యులు, స్థానిక బిఆర్ఎస్ నాయకులు, సిల్వర్ పార్క్, అర్బానా, ఫ్రూట్స్ ఎంక్లేవ్, శ్రీని ఎంక్లేవ్‌తో పాటు పరిసర కాలనీల నివాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొత్త పార్క్ అందుబాటులోకి రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## జిల్లా ఎస్పీ జానకి షర్మిలను కలిసిన భైంసా మున్సిపల్ చైర్మన్ తుమ్మల దత్తు, వైస్ చైర్మన్ మిర్జా ఇద్రీస్ బేగ్

**పట్టణంలో శాంతి భద్రతలు బలోపేతానికి చర్యలు**

**ప్రజా సమస్యల పరిష్కారానికి సహకారం అందిస్తామని ఎస్పీ హామీ**






**నిర్మల్ అక్షిత బ్యూరో:** భైంసా మున్సిపల్ చైర్మన్ తుమ్మల దత్తు, వైస్ చైర్మన్ మిర్జా ఇద్రీస్ బేగ్ బుధవారం భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భైంసా పట్టణంలోని శాంతి భద్రతల పరిస్థితి మరియు ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. పట్టణంలో శాంతి భద్రతలు మరింత బలోపేతం కావడానికి అవసరమైన చర్యలపై కూడా వారు ఎస్పీతో అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తుమ్మల దత్తు మాట్లాడుతూ భైంసా పట్టణ అభివృద్ధికి శాంతియుత వాతావరణం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉండడం అభినందనీయమని తెలిపారు. అలాగే ప్రజలకు సంబంధించిన కొన్ని స్థానిక సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చినట్లు చెప్పారు. వైస్ చైర్మన్ మిర్జా ఇద్రీస్ బేగ్ కూడా పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలను జిల్లా ఎస్పీకి వివరించారు. వాటిపై స్పందించిన ఎస్పీ జానకి షర్మిల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# లక్ష్యం ఉంటేనే విజయం

**విద్యార్థులకు ప్రేరణ**

**చిన్నారుల అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర**



**సూర్యాపేట , అక్షిత ప్రతినిధి :** లక్ష్యం ఉంటేనే విజయం తథ్యమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ విద్యార్థులకు ప్రేరణ కలిగించారు.జిల్లాలోని సూర్యాపేట మండలం రామన్నగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో గల ప్రైమరీ పాఠశాలను జిల్లా కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా సందర్శించి, పర్యవేక్షించారు.ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణను పరిశీలించారు.తరగతి గదుల్లో జరుగుతున్న బోధన విధానాన్ని గమనించి,అభిరామ్,నాగశ్రీ, లాస్య,శివకుమార్,శృతి వంటి విద్యార్థులను పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి వారి విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థుల ప్రతిభ పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూనే,ఉపాధ్యాయులు మరింత సృజనాత్మకంగా బోధించాలని సూచించారు.

పాఠశాలలో మధ్యాహ్న భోజనం, తాగునీరు,పరిశుభ్రత వంటి సదుపాయాలను కూడా పరిశీలించి విద్యార్థులకు నోట్ బుక్స్,పెన్నులు పంపిణీ చేశారు. తదనంతరం అదే రామన్నగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



నిర్వహించారు.ఈ క్రమంలో కేంద్రంలోని చిన్నారుల హాజరు,పౌష్టికాహార పంపిణీ, గర్భిణీ స్త్రీలు,బాలింతలకు అందిస్తున్న సేవల గురించి కలెక్టర్ ఆరా తీశారు.అక్కడ వంట గదిని పరిశీలించి,పిల్లలకు అందిస్తున్న ఆహారం నాణ్యతను పరిశీలించి, కేంద్రంలో శుభ్రతను కాపాడాలని, భోజనాన్ని మంచిగా ఉడకపెట్టి అందించాలని సిబ్బందికి సూచించారు.చిన్నారుల ఆరోగ్యం, విద్యాభివృద్ధి కోసం అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. గర్భిణీ స్త్రీలు,బాలింతలు,చిన్న పిల్లలకు అందే పోషకాహారం సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక పనుల పరిశీలన...**

99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అదే రామన్నగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ మేరకు పరిసర ప్రాంతంలో పారిశుద్ధ్యం, తాగునీటి సదుపాయం వంటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.గ్రామంలోని వీధులు, కాలువలు,చెత్త నిర్వహణ విధానం వంటి అంశాలను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రామంలో చెత్త పేరుకు పోకుండా సమయానికి తొలగించాలని, ప్రజలు కూడా పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని సూచించారు. పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు.అదే విధంగా ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించి, అందరూ కలిసి సమన్వయంతో ఎల్లప్పుడూ కూడా స్వచ్ఛమైన గ్రామ వాతావరణం కోసం కృషి చేయాలని తెలిపారు.ఈ పరిశీలనలో డీపీఓ యాదగిరి, తహసిల్దార్ కృష్ణయ్య,సంబంధిత అధికారులు,సిబ్బంది,స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల నివారణ పట్ల అవగాహన పెంచుకోవాలి



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** గ్రామాలలో, ఇళ్ళలో ఆకస్మాత్తుగా సంభవించే అగ్ని ప్రమాదాల పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ బి. మధుసూదన్ రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ లో బుధవారం ఫైర్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణ చర్యల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు సంభవించడానికి గల కారణాలను క్షుణ్ణంగా వివరించారు. ఆకస్మాత్తుగా ప్రమాదాలు సంభవిస్తే పాటించవలసిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ ఫైటర్ డి. రామ నర్సయ్య, పాఠశాల కరెస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ బి. యాదగిరి, డైరెక్టర్ జెవియన్ఎస్ మణి, ఫైర్ సిబ్బంది మీర్జా షఫీ బేగ్, మహేశ్వరం పాండు, డి.గోపాల్, బి. ఇంద్రయ్య, ఆర్. సురేష్, పాఠశాల ఉపాధ్యాయులు మురళి, రషీద్, మల్లేష్, శ్రీనివాస్, అలీమ్, మహాలక్ష్మి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## సత్తుపల్లి డివిజన్ స్థాయిలో టాలెంట్ స్కూల్ విద్యార్థులకు బహుమతులు



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** శ్రీ రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ తెలంగాణ మరియు శ్రీ రామకృష్ణ సేవా సమితి సత్తుపల్లి వారి ఆధ్వర్యంలో భారతీయ మహిళా అనే పుస్తకం పై నిర్వహించిన పరీక్షలో సత్తుపల్లి డివిజన్ స్థాయిలో ప్రథమ బహుమతి ముప్పాళ కావ్య, తృతీయ బహుమతి కొట్టే మౌనిష, చిన్నంశెట్టి లాస్య శ్రీ, అదేవిధంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన షేక్ ఆస్పియా, షేక్ ఆరీఫా, ఎండి సానియాలకు ప్రశంసా పత్రమును సాధించి గంగారాం 15వ బెటలియం కమాండంట్ అంజయ్య , సత్తుపల్లి మండల విద్యాశాఖ అధికారి రాజేశ్వరరావు ల చేతుల మీదుగా బహుమతులు అందుకోవడం జరిగింది . విజేతలను టాలెంట్ స్కూల్ కరెస్పాండెంట్ పులి శ్రీనివాసరావు ప్రిన్సిపాల్ పులి అరుణ అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ ఇంచార్జ్ శంకర్, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పాలమూరు బిడ్డలు కోహినూర్ వజ్రాలు

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**




**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:** మహబూబ్‌నగర్‌లో పుట్టిన ప్రతి బిడ్డ అసాధారణమైన వారేనని, పాలమూరు బిడ్డలు లేబర్ కాదని, కోహినూర్ వజ్రాలు అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ మరియు వందేమాతరం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లోని వైటిసి బిల్డింగ్ లో గత 45 రోజుల పాటు ఐఐఐటీ లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న 150 మంది విద్యార్థులకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ శిబిరం ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలమూరు అంటే కేవలం శ్రామిక జిల్లా కాదని, ఎన్నో అన్యాయాలు, దగా, మోసాలకు గురైన జిల్లా అని అన్నారు. తెలంగాణ ఉద్యమానికి పాలమూరు చరిత్ర ఒక ప్రధాన ఆధారమని, తెలంగాణ ఉద్యమంలో పాలమూరుకు జరిగిన అన్యాయం గురించి చెప్పి రాష్ట్రాన్ని సాధించుకున్నామని ఆయన చెప్పారు . తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా పాలమూరు జిల్లాకు పూర్తి న్యాయం జరగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే యువత తెలంగాణ చరిత్రను కొత్తగా రాసి , భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును నిర్ధారించే శక్తి యువతలోనే ఉందన్నారు. అందుకే విద్యార్థులు తమ లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకుని కష్టపడాల్సిన అవసరం ఉందన్నారు. ఎంత ఎత్తుకు ఎదగాలనుకుంటే అంత ఎత్తుకు ఎదగడానికి తెలంగాణ రాష్ట్రంలో అవకాశాలు చాలా ఉన్నాయని, అందుకు అవసరమైన సహాయ సహకారాలు ఎల్లవేళలా తాను అందించేందుకు సిద్ధంగా ఉన్నానని హామీ ఇచ్చారు. ఎన్నో



దశాబ్దాలుగా మన ప్రాంతం ఎన్నో కష్టాలు, కరువు కాటకాలు ఎదుర్కొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. మనకు వనరులు లేవని కేవలం మన పూర్వీకులు ఇచ్చిన జ్ఞానమే మనకు ఉన్న ఏకైక ఆస్తి అని ఆయన అన్నారు. మన డిఎన్ఏలో ఉన్న మేధస్సు, తెలివి, కష్టపడే మనస్తత్వం, ప్రేమతో పలకరించే గుణాన్ని మనం ఆయుధాలుగా చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ శిబిరంలో పాల్గొన్న 150 మంది విద్యార్థులు తమ విజయాలతో తల్లిదండ్రులకు పేరుప్రఖ్యాతులు తేవాలని ఆకాంక్షించారు. బాగా కష్టపడి చదవాలని, అది తమకోసం మాత్రమే కాకుండా కుటుంబ భవిష్యత్తు కోసం కూడా అవసరమని సూచించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి విద్య మరియు సాగునీటి రంగాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. గత రెండేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడం జరిగిందని, ఇంకా చేయాల్సింది చాలా ఉందన్నారు. ఈ విద్యా యజ్ఞంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు వచ్చే పది సంవత్సరాలు కష్టపడాలని పిలుపునిచ్చారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం చెప్పిన అనే సందేశాన్ని గుర్తుచేస్తూ, ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధన కోసం కష్టపడాలని విద్యార్థులకు సూచించారు. మహబూబ్‌నగర్ అభివృద్ధికి అవసరమైనన్ని నిధులు ఇవ్వడానికి ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నారని, ఇది జిల్లాకు లభించిన గొప్ప అవకాశమని, ఇదే మన పాలమూరుకు లభించిన స్వర్ణయుగమని ఆయన అన్నారు. పాలమూరు లేబర్ జిల్లా కాదని, సరస్వతి పుత్రుల అడ్డాగా నిలిపే బాధ్యత మనందరిదని పిలుపునిచ్చారు. గౌరవ అతిథిగా పాల్గొన్న జిల్లా ఎస్పీ డి జానకి మాట్లాడుతూ వ్యక్తి జీవితంలో విద్య వైద్యం రెండూ లభిస్తే జీవితం సాఫీగా ముందుకు సాగుతుందన్నారు. మీ తల్లిదండ్రులు మీ పైన పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, అందుకే కసిగా చదువుకోవాలని, లక్ష్యంలో ఆడ, మగ అనే తేడా ఉండదని చెప్పారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదివినప్పుడు నాడు ఇలాంటి ఎమ్మెల్యే లేరని, అయినా కాన్ఫిడెన్స్ తో చదివి, ఎస్పీగా ఎంపికైనట్లు ఆమె చెప్పారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ వందేమాతరం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ పొందిన విద్యార్థులు పదవతరగతి లో ఉత్తమ మార్కులు సాధించి, ఐఐఐటీలో సీటు సాధించి, ఎమ్మెల్యే గారికి రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలని ఆమె ఆకాంక్షించారు. నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ ను ఎడ్యుకేషనల్ హబ్ గా అభివృద్ధి చేయడంలో సఫలీకృతం అయిన ఎమ్మెల్యే పేదింటి బిడ్డల కలలను సాకారం చేయడానికి చాలా కృషి చేస్తున్నారని ఆమె చెప్పారు. డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే ఫాలోవర్స్ ను తయారు చేయడం లేదని, లీడర్లను తయారు చేస్తున్నారని ఆయన అన్నారు. ఇలాంటి ఎమ్మెల్యే తో కలిసి ప్రయాణం చేయడం జీవితంలో గొప్పని అనుభూతి కలుగుతుంది అని ఆయన చెప్పారు. వందేమాతరం ఫౌండేషన్ ఫౌండర్ రవీందర్ మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలోనే కాదు దేశంలో కూడా ఇలాంటి నాయకుడు దీపం పట్టి ఏ మూలన వెతికినా కనిపించదని, కోహినూర్ వజ్రం తనకు మాత్రం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్ గుముడాల రాధ గోవర్ధన్ గౌడ్, డిఇఓ ప్రవీణ్ కుమార్, ఐఐఐటీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రావణ్ కుమార్, ఎఎంఓ దుంకుడు శ్రీనివాస్, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, వందేమాతరం ఫౌండేషన్ కో ఆర్డినేటర్ రవీందర్ రెడ్డి , సోంబుపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అట్రాసిటీ బాధితులకు సత్వర న్యాయానికి చర్యలు

**జిల్లా కలెక్టర్ కె. హరిత**



**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** జిల్లాలో అట్రాసిటి బాధితులకు సత్వరమే న్యాయం,పరిహారం అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హరిత అన్నారు. బుదవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి, పోలీస్ రెవెన్యూ, ఎస్సీ సంక్షేమ, శిశు సంక్షేమ,డి వి యం సి సభ్యులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, కాగజ్నఘర్ డి ఎస్ పి వహీదుద్దిన్,తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బాధిత కుటుంబాలకు సత్వరమే న్యాయం, పరిహారం, అందజేసేలా చర్యలు తీసుకోవాలని అధికారాలను ఆదేశించారు. 2025 సంవత్సరంలో 31 కేసులు నమోదు అయ్యాయని 2026 సంవత్సరంలో ఇప్పటివరకు ఆసిఫాబాద్ సబ్ డివిజన్ పరిధిలో మూడు కేసులు కాగజ్నగర్ సబ్ డివిజన్ పరిధిలో 3 కేసులు,నమోదయ్యాయని వాటిని త్వరగా విచారించి నిందితులకు చట్టపరంగా శిక్షలు పడే విధంగ చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి నెల 30వ తేదీన ప్రతి మండలంలో పౌర హక్కుల రోజు కార్యక్రమం నిర్వహించేలా మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకుంటామని గ్రామిణాభివృద్ధి అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ అధికారి అశోక్, దత్తారావు, ఆసిఫాబాద్ సీఐ బాలాజీ వరప్రసాద్, డివిఎంసి సభ్యులు కేశవ్ రావు, సిడాం అర్జున్, గంగు బాయి, అశోక్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు సదరం వైద్య శిభిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ కె. హరిత**



**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** దివ్యాంగులు సదరం శిభీరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న సదరం శిబిరంను కలెక్టర్ కె. హరిత జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తరావు కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సదరం శిబిరంకు వచ్చే దివ్యాంగులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు దివ్యాంగులకు త్రాగునీరు, చక్రాల కుర్చీలు, అందుబాటులో ఉంచాలన్నారు. స్లాట్ బుక్ చేసిన వారు సదరం శిబిరానికి వచ్చేలా పర్యవేక్షించాలన్నారు. సదరం శిబిరంలో కంటి చూపు, మానసిక వైకల్యం, రక్త శ్రావ ఋగ్మత,సికిల్ సెల్,తలసేమియా, హిమో పిలియా, మూగ,చెవిటి,ఎముకల వంటి వైకల్య రకం పై దివ్యాంగత్వాల వారి సదరం వైద్య శిబిరాలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో (డిపిఎం పెన్షన్ విభాగం) రామకృష్ణ, వైద్యులు, సిబ్బంది, దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను తనిఖీ చేసిన అధికారులు

**లబ్ధిదారులు లేని ఇళ్లకు నోటీసులు జారీ**

**మేడ్చల్, అక్షిత ప్రతినిధి :** లబ్ధిదారులకు మంజూరైన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అధికారులు తనిఖీలు చేశారు. జిహెచ్ఎంసీ పరిధిలోని తూంకుంట లో 9 బ్లాకులలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ లను అధికారులు బుధవారం తనిఖీలు చేశారు. ముషీరాబాద్, అంబర్ పేట్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల నుంచి వచ్చినవారు డబుల్ బెడ్ రూమ్ లలో ఉండగా ముషీరాబాద్ తహశీల్దార్ కార్యాలయం నుండి అధికారులు వచ్చి తనిఖీలు నిర్వహించారు. తాళాలు ఉన్న డబుల్ బెడ్ రూమ్



ఇళ్లకు అధికారులు నోటీసులు డోర్ లకు అతికించి వెళ్లారు. ఒక్కో బ్లాక్ లో 216 మందికి మంజూరు కాగా దాదాపు 2వేల మందికి ఇళ్లు మంజూరయ్యాయి. కాగా సుమారు 350 నోటిసీలు రాగా అందులో 60 శాతం మంది ఉన్నట్లు సమాచారం వచ్చినట్లు అధికారులు తెలిపారు. లేని వారికి నోటీసులు అందజేయడం జరిగిందని అధికారులు తెలిపారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



## ఈవీఎం గోదాం వద్ద అప్రమత్తంగా ఉండాలి

### ఈవీఎం గోదాశీను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా





**మహబూబ్ నగర్,అక్షిత ప్రతినిధి:** రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఈవీఎం గోదాశీను త్రైమాసిక తనిఖీ లో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా రాజకీయ పార్టీ ప్రతినిధిలతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గనిర్ధేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవిఎం, వివిప్యాట్ గోదాంను తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవిఎం ల రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈవిఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీసీ ఫుటేజ్ ల గదుల పనితీరు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సి.ఈ.ఓ ,రాష్ట్ర ఈ.వి.యం.నోడల్ ఆఫీసర్ బి.హరి సింగ్ అడిషనల్ కలెక్టర్ రెవిన్యూ జీ.ఎల్.బి హరిప్రియ, ఆర్డీవో నవీన్,ఎన్నికల డి.టి.జఫర్, రాజకీయ పార్టీల ప్రతినిదులు ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కూచన రమ మృతికి డ్యాగల శ్రీనివాస్ నివాళి



**నర్సంపేట అక్షిత ప్రతినిధి:** నర్సంపేట పట్టణంలోని సర్వాపురం 6వ వార్డుకు చెందిన కూచన రమ బుధవారం మరణించారు. బీసీ సంక్షేమ సంఘం చెన్నారావుపేట మండల ఉపాధ్యక్షుడు మేరుగు శంకర్ లింగం సోదరి అయిన రమ మృతదేహంపై బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు, నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు మామిడాల రాజేందర్, కొంతం బాబు, గుండు బాబ్జీ, నర్సంపేట పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్, పట్టణ కార్యదర్శులు నూనె రంజిత్ కుమార్, గాండ్ల శ్రీనివాస్, గుల్లపెల్లి సుధాకర్, కూచన రవీందర్, మండల కార్యదర్శి మారపాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నాగర్ కర్నూలు జిల్లా సృజనాత్మకతను జోడిస్తూ మహిళలు ఆర్థికంగా వ్యాపార అభివృద్ధిని సాధించాలి

### జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్ కర్నూలు అక్షిత ప్రతినిధి:** మహిళలు తమ ఆలోచనలు సృజనాత్మకతను జోడిస్తూ ఆకర్షణీయమైన ఉత్పత్తులను రూపొందించి ఆర్థికంగా మరింతగా అభివృద్ధి చెందాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం కల్వకుర్తి మున్సిపల్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా సందర్శించారు.

కల్వకుర్తి పట్టణంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల నిర్వహణ అమలుపై కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ తో ఆరా తీశారు. మెప్మా మహిళా సంఘాల ఆధ్వర్యంలో వేస్ట్ మెటీరియల్‌ను వినియోగించి తయారు చేసిన వివిధ రకాల ఆకర్షణీయమైన వస్తువులతో ఏర్పాటు చేసిన స్టాల్‌ను నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సందర్శించి పరిశీలించారు.

ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు వ్యర్థ పదార్థాలను వినూత్నంగా ఉపయోగించి తయారు చేసిన అలంకరణ వస్తువులు, గృహ వినియోగ వస్తువులు మరియు హస్తకళా



ఉత్పత్తులను కలెక్టర్‌కు మహిళలు వివరించారు. ముఖ్యంగా పాత టైర్లను వినియోగించి ఆకర్షణీయమైన పూల కుండీలు తయారు చేయడం ప్రత్యేకంగా ఆకట్టుకుంది. రంగురంగులుగా అలంకరించి రూపొందించిన ఈ పూల కుండీలు పర్యావరణ పరిరక్షణతో పాటు ఇంటి పరిసరాలను అందంగా తీర్చిదిద్దే విధంగా ఉన్నాయని కలెక్టర్ మహిళలను ప్రత్యేకంగా అభినందించారు.

మహిళల సృజనాత్మకతతో తయారైన ఈ



వస్తువులను పరిశీలించిన కలెక్టర్ బాదావత్ సంతోష్ మహిళా సంఘాల సభ్యులను అభినందించారు. వ్యర్థ పదార్థాలను పునర్వినియోగం చేయడం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు మహిళలకు అదనపు ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు మహిళల స్వయం ఉపాధికి దోహదపడటమే కాకుండా సమాజంలో పర్యావరణంపై అవగాహన పెంచడానికి కూడా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మహిళలు తమ ప్రతిభను మరింతగా వినియోగించి ఇలాంటి సృజనాత్మక ఉత్పత్తులు తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఆర్డీవో జనార్ధన్ రెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల, వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్, కల్వకుర్తి మున్సిపల్ కార్పొరేషన్ అహ్మద్ హుస్సేన్,సంబంధిత అధికారులు, మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పురజనులకు సత్య మార్గాలు

**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** సదా ధర్మం పరిడవిల్లే విధంగా పురజనులకు సత్య మార్గాలు సూచించుకుంటూ ముందుకు వెళ్లాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. మిర్యాలగూడ పట్టణ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం మిర్యాలగూడ నియోజకవర్గ బ్రాహ్మణ పురోహిత, అర్చక సేవా సమాఖ్య ఆధ్వర్యంలో శ్రీ పరాభవ నామ సంవత్సరం పంచాంగం ఆవిష్కరించారు.. ఈ సమావేశానికి గౌరవ అధ్యక్షులు పులి కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దౌల్తాబాద్ వాసుదేవ శర్మ మాట్లాడుతూ కొత్త తరం పంచాంగ గుణితశీకు మక్కువ ప్రదర్శించాలన్నారు. గత తరంవారు పంచాంగాన్ని గుణించటం వలన ఇప్పటికి మనం పాటిస్తున్నామని కొత్త యువతరం పంచాంగము జ్యోతిషంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. బ్రాహ్మణులు గ్రామ ప్రజల జనుల శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తుంటారన్నారు. అర్చక , పురోహితులు కలిసి ఉండాలని వారికి ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తనకు తెలియజేస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. నల్లగొండ జిల్లా బ్రాహ్మణ అఫీషియల్, నాన్ అఫిషియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రాయప్రోలు మురళీకృష్ణ శర్మ మాట్లాడుతూ అర్చక పురోహితంలో కొనసాగుతున్న వారు వృత్తిపట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గ బ్రాహ్మణ పురోహిత అర్చక సేవా సంఘం అధ్యక్షులు రాధాకృష్ణశర్మ



మాట్లాడుతూ సంఘం నూతనంగా ఏర్పడక ముందు పలు సేవా కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని నల్గొండ జిల్లాలో మిర్యాలగూడ బ్రాహ్మణ పురోహిత అర్చకలకు గుర్తింపు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. గౌరవ అధ్యక్షులు పులి కృష్ణమూర్తి మాట్లాడుతూ అర్చక రోహిత సంఘం సేవలు ప్రశంసనీయమన్నారు. తిధులు ముహూర్తాలపై ప్రజలకు అవగాహన ఉందని, అర్చకులు, బ్రాహ్మణులు ముహూర్తాలు, తిధులు చూసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు . మిర్యాలగూడ అర్చక పురోహిత సేవా సమాఖ్య ఉపాధ్యక్షులు రయ్యాల ఫణి కుమారచార్యులు మాట్లాడుతూ బ్రాహ్మణ, అర్చకుల ఆధ్వర్యంలో పంచాంగావిష్కరణ సంతోషంగా ఉందన్నారు. మిర్యాలగూడ బ్రాహ్మణ పురోహిత అర్చక సేవా సమాఖ్య ఉపాధ్యక్షులు చిట్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘంలో ఉన్న ప్రతి సభ్యులు సంఘం కోసమే పని చేయాలి, సంఘంపై విమర్శలు చేయడం వలన ప్రయోజనం ఉండదన్నారు. ప్రముఖ వేద పండితులు సూలూరి శివ సుబ్రహ్మణ్యంశర్మ మాట్లాడుతూ సంఘ ధర్మాలు సభ్యులు ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో కనకదుర్గ దేవాలయం ప్రధాన అర్చకులు తెంపెల్లి శంభు ప్రసాద్ శర్మ, ప్రముఖ పంచాంగ కర్త హనుమంతరావు, మిర్యాలగూడ నియోజకవర్గ బ్రాహ్మణ పురోహిత, అర్చక సమాఖ్య కార్యవర్గ సభ్యులు, శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం కమిటీ అధ్యక్ష ఉపాధ్యక్షులు వెంకటరెడ్డి, చెన్నూరు వేణుగోపాలరావు పాల్గొన్నారు. సమావేశ ప్రారంభం ముందు సహస్రాణి బాలిక భగవద్గీత శ్లోకాలను పట్టించారు వారికి చిరు సత్కారం చేశారు. మిర్యాలగూడ నియోజకవర్గ బ్రాహ్మణ పురోహిత అర్చక సేవా ముద్రించిన పరాభవ నామ సంవత్సర పంచాంగం, పెండ్యాల హనుమంతరావు రచించిన పంచాంగం ఆవిష్కరించారు, అతిథులను దుశాలువులతో సన్మానించారు.

# ఏప్రిల్ 28 నుంచి ఐఆర్‌సీటీసీ 'భారత్ గౌరవ్' యాత్రలు

**తెలుగు రాష్ట్రాల భక్తుల కోసం 4 ప్రత్యేక ప్యాకేజీలు**

**అయోధ్య, కాశీ, మాతా వైష్ణోదేవితో పాటు విదేశీ పర్యటనలు కూడా..**



మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి: వేసవి సెలవుల్లో తీర్థయాత్రలకు వెళ్లే భక్తుల కోసం రైల్వే శాఖ ప్రతిష్ఠాత్మకమైన "భారత్ గౌరవ్ టూరిస్ట్" రైళ్లను అందుబాటులోకి తెచ్చింది. తెలుగు రాష్ట్రాల ప్రజల సౌకర్యార్థం ఏప్రిల్ 28 నుండి జూన్ 12 వరకు హైదరాబాద్ (సికింద్రాబాద్) కేంద్రంగా నాలుగు ప్రత్యేక ప్యాకేజీలను ప్రారంభించనున్నట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం అసిస్టెంట్ మేనేజర్ పి.వి. వెంకటేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

**ముఖ్యమైన రైలు ప్యాకేజీల వివరాలు:**

అయోధ్య–కాశీ–బైద్యనాథ్ ధామ్ (ఏప్రిల్ 28 – మే 7): పూరి, కోణార్క్, వారణాసి, అయోధ్య, ప్రయాగరాజ్ సందర్శన. స్లీపర్ క్లాస్ ధర ₹16,700 నుండి ప్రారంభం.హరిద్వార్–రిషికేశ్–మాతా వైష్ణోదేవి (మే 12 – మే 21): మథుర, బృందావనం, వైష్ణోదేవి ఆలయాల సందర్శన. స్లీపర్ క్లాస్ ధర ₹16,500.

దివ్య దక్షిణ యాత్ర (మే 24 – మే 31): అరుణాచలం, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, తంజావూరు మీదుగా సాగే ఈ యాత్ర ధర ₹14,500 నుండి ప్రారంభం.

యమునా పుష్కరాల ప్రత్యేక యాత్ర (జూన్ 3 – జూన్ 12): బైద్యనాథ్ ధామ్, అయోధ్య, కాశీతో పాటు యమునా నది పుష్కరాల సందర్శన. ధర ₹16,700.

**సౌకర్యాలు:**

ఈ ప్యాకేజీలలో రైలు ప్రయాణం, బస్సు వసతి, హోటల్ వసతి, మూడు పూటలా భోజనం, వాటర్ బాటిల్స్, టూర్ ఎస్కార్ట్ మరియు ప్రయాణ బీమా సౌకర్యాలు కల్పిస్తారు. భద్రత కోసం ప్రతి కోచ్‌కు ఒక సెక్యూరిటీ గార్డుతో పాటు సీసీ కెమెరాల నిఘా ఉంటుందని వెంకటేష్ వివరించారు.



**ప్రత్యేక విమాన ప్యాకేజీలు:**

రైలు యాత్రలతో పాటు ఏప్రిల్, మే నెలల్లో హైదరాబాద్ నుండి కాశ్మీర్ (₹42,590), లడఖ్ (₹61,880), అండమాన్ (₹46,950), మరియు చార్ ధామ్ (₹74,430) వంటి దేశీయ ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. అలాగే నేపాల్, థాయిలాండ్, శ్రీలంక మరియు యూరోప్ వంటి అంతర్జాతీయ ప్యాకేజీలను కూడా ఐఆర్‌సీటీసీ ప్రకటించింది. వీటన్నింటికీ ఎల్‌టీసీ సదుపాయం వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు.

**సంప్రదించాల్సిన నంబర్లు:**

టికెట్లు బుక్ చేసుకోవాలనుకునే వారు 9701360701, 9281030733, 9281030734 నంబర్లలో లేదా ఊఊఊ.అఱతీఛ్‌ీశీబతీఱంఎ.ఛిశీ వెబ్‌సైట్ ద్వారా సంప్రదించాలని కోరారు.

# మహిళల కు ఆర్థిక స్వేచ్ఛ లభించినపుడే కుటుంబం నిలదొక్కుకుంటుంది

**జిల్లా సంక్షేమ అధికారి రాజమణి**




వరంగల్, అక్షిత బ్యూరో: ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళా సాధికారత సాధించడానికి మహిళలు అనేక రంగాలలో ముందుకు సాగాలని వరంగల్ జిల్లా సంక్షేమ అధికారి రాజమణి అన్నారు .

బుధవారం ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం టైలరింగ్ బ్యూటిషన్ కోర్సులలో శిక్షణ పొందిన 300 మందికి సర్టిఫికెట్ల ప్రధాన కార్యక్రమము నిరుపేద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాజమణి మాట్లాడుతూ సమాజంలో మహిళల పట్ల వివక్షత నిర్లక్ష్యత హింస కొనసాగుతుందని దీని అధిగమించడానికి మహిళా సాధికారత సాధించడానికి వారికి నైపుణ్య శిక్షణతో పాటు అనేక రంగాలలో వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్, సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్, వరంగల్, మహబూబాబాద్ జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్పర్సన్,వసుధ,నాగవాణి తో పాటు నిర్వాహకులు ఎర్ర శ్రీకాంత్ బత్తుల కరుణ,వివిధ ప్రాంతాల నుంచి మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా రంగాలలో విశిష్ట సేవలు చేసిన 15 మంది మహిళలను అధికారులచే సన్మానించారు.

# విద్యుత్ కోతలను అరికట్టాలి...

**సిపిఎం డిమాండ్**



వలిగొండ/ అక్షిత న్యూస్: విద్యుత్ కోతలను అరికట్టాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు.బుధవారం రోజున సుంకిశాల గ్రామంలో విద్యుత్ కోతలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ ఇటీవల కాలంలో విద్యుత్ కోతలు పెరిగాయని ప్రస్తుతం వేసవికాలంలో ఇవి మరింత పెరగడంతో దీనివల్ల రైతులు విద్యుత్ ఎప్పుడు వస్తుందోనని ఎదురు చూడాల్సి వస్తుందని తమ మోటర్లు కాలిపోతున్నాయని దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మరోవైపు జనావాసాల్లో ఉండే ప్రజలు విద్యుత్ కోతల వల్ల తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం అధికారులు విద్యుత్ కోతలను నివారించి సక్రమమైన విద్యుత్తును అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పిఎన్ఎం జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, మండల కమిటీ సభ్యులు కొండే కిష్టయ్య, చెరుకు జంగయ్య, మంగ పాండు,పోలేపల్లి ఉప్పలయ్య, ఈతాప నగేష్,కాటేపల్లి వెంకటేశం, పోలేపల్లి పెద్ద స్వామి, బోడాసు సోములు,రాజు తదితరులు పాల్గొన్నారు.

## సంచార జాతుల సమగ్ర సర్వే పుస్తకాన్ని

# ఆవిష్కరించిన మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్, అక్షిత బ్యూరో : సంచార జాతులు, సమగ్ర సర్వే, సంచార, అర్ధసంచార, విముక్త జాతుల ఆర్థిక సామాజిక స్థితిగతుల అధ్యయనంపై రూపొందించిన పుస్తకాన్ని బుధవారం కరీంనగర్ మేయర్ కోలగాని శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ కోలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలోనే మొదటి సారి సంచార జాతులపై తెలంగాణలో సామాజిక సమరసతా వేదిక సమగ్ర సర్వే నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సామాజిక సమరత బాధ్యులు మాట్లాడుతూ అక్టోబర్ 26 నుండి డిసెంబర్ 31 వరకు తెలంగాణలోని 29 జిల్లాల్లో 33 తెగల వారిని సమరత కార్యకర్తలు కలిశారని, 1450 కుటుంబాల వద్దకు 70 మందికి పైగా సమరసతా కార్యకర్తలు వెళ్లి 7000 మందికి పైగా కుటుంబ సభ్యుల వివరాలను సేకరించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్థిక,సామాజిక, సాంస్కృతిక అంశాలతో పాటు 25 కి పైగా విషయాలను ప్రశ్నావళిగా రూపొందించడం జరిగిందన్నారు. వాటి ఆధారంగా సేకరించిన



సమాధానాలతో పారదర్శకమైన గణాంకాలతో మ్యాప్ లు,గ్రాఫ్ తో , 136 పేజీలతో కలర్ బొమ్మలతో కూడిన ఒక పుస్తకం ప్రచురించటం జరిగిందని వివరించారు. దీని వల్ల అటు ప్రభుత్వానికి,ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం,విశ్వ విద్యాలయాల కులపతులు,ఆచార్యులకు, సివిల్స్ ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు,ఇటు సేవా కార్యక్రమాలు చేసే స్వచ్ఛంద సేవా సంస్థలకు,సామాజిక కార్యకర్తలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ప్రధానంగా స్వాతంత్ర్యం పొంది ఇన్నేళ్ళైనా సంచార జాతులు రాజ్యాంగ ఫలాలు అందక,బిక్కు బిక్కుమని బ్రతుకులు ఈడుస్తున్న దీన,దుఃఖితులు ఇంకా ఈ సమాజంలో వున్నారనే సత్యం అందరికీ బోధ పడుతుందన్నారు. పక్కా ఇళ్ళు,చదువు,వైద్యం, టాయిలెట్స్,విద్యుత్,ఉద్యోగాలు, మంచి నీళ్ళు, ప్రభుత్వ పథకాలు, కుల సర్టిఫికెట్స్, ఆధార్ కార్డులు మొదలైనవి అందక జీవిస్తున్న ఈ వర్గాల వారి కోసం సమరసతా వేదిక అండగా నిలుస్తుందన్నారు. అటు పాలకులు ఇటు సభ్య సమాజం ఈ వర్గాల వారిని తోటి భారతీయులుగా భావించి, వారి అభ్యున్నతికి ఉపయోగపడే సూచనలు, సలహాలు అందించే విధంగా ఈ పుస్తకం తెలుగులో,ఇంగ్లీష్ భాషలలో ప్రచురించడం జరిగిందని తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక జిల్లా అధ్యక్షులు తుమ్మల రమేష్ రెడ్డి, తెలంగాణ ప్రాంత కార్యదర్శి పుల్లూరి రామారావు, బోయిని పురుషోత్తం, కనికరం లక్ష్మణ్, ఉండేటి శ్రీకాంత్, దావు సంతోష్ కుమార్ సమరసత సభ్యులు పాల్గొన్నారు.

## గోడౌన్ లను ఆకస్మికంగా తనిఖీ చేసిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు



**ఖమ్మం /అక్షిత బ్యూరో :** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ లోని గిడ్డంగుల సంస్థ గోడౌన్ లను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు.గోడౌన్ లలో నిల్వ చేస్తున్న సన్న బియ్యాన్ని పరిశీలించి వాటి నాణ్యతను నిల్వలను ముఖ్యంగా రేషన్ దుకాణాలకు సరఫరా చేయాల్సిన బియ్యం సరిగ్గా ఉందా లేదా అని తనిఖి చేశారు.బియ్యం నిల్వల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.అనంతరం నేలకొండపల్లి మండలం కోరట్లగూడెం గ్రామానికి చెందిన బచ్చలకూరి అభినయ్ ఇటీవల ఇంటర్ పరీక్షలు రాసి వస్తుండగా బైక్ ప్రమాదం జరిగి చికిత్స పొందుతూ మరణించారు.విషయం తెలుసుకున్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు వారి భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ పాలేరు నియోజకవర్గ సేవాదళ్ కన్వీనర్ బచ్చలికూరి నాగరాజు రాయగూడెం సర్పంచ్ బోయిన వేణు నంబూరి రామారావు నేలకొండపల్లి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు యడవల్లి నాగరాజు కోడిరెక్కల వినోద్,తదితరులు పాల్గొన్నారు.

## చెరువు మాదారం హైస్కూల్ విద్యార్థులకు పరీక్ష పాడ్స్ పంపిణీ చేసిన మోదుగు వేలాద్రి



**ఖమ్మం/అక్షిత బ్యూరో :** నేలకొండపల్లి మండలం చెరువు మాదారం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, నేలకొండపల్లి సబ్ ట్రెజరీ ఆఫీసర్ మోదుగు వేలాద్రి 30 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చదువుకున్న రోజుల్లో పడిన ఇబ్బందులు అదేవిధంగా తాను ఇప్పుడున్న పరిస్థితి గురించి విద్యార్థులకు చక్కగా వివరిస్తూ వారిలో స్ఫూర్తిని నింపి పరీక్షలు బాగా రాయాలని ఉన్నత స్థానానికి వెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎమ్ నరేందర్ పరీక్షా సామాగ్రి పంపిణీ చేసిన ఎస్టీఓ కి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్టీవో ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్స్ వై శ్రీనివాస్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి బి రాము ఎం శ్రీలత ఎస్ శ్రీనివాసరావు ఆర్ అరవింద కుమార్ వి కల్పవల్లి పి వేణు పి మంగేశ్వరి బి ప్రసాద్ వి ఈశ్వరమ్మ పి సత్యనారాయణ పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న దేవరకొండ శాసనసభ్యుడు బాలు నాయక్

**వచ్చే ఎన్నికల కోసం కాకుండా**

**వచ్చే తరాల భవిష్యత్తు కోసం ఆలోచించే వాడే నాయకుడు...**

**ప్రతి మహిళకు గౌరవం, భద్రత, ఆర్థిక బలం కల్పించే దిశగా నిరంతరం కృషి చేస్తున్నాం**



**పెద్ద అడిశర్లపల్లి (గుడిపల్లి ), అక్షిత ప్రతినిధి:** గుడిపల్లి మండలంలో సింగరాజుపల్లి, కొందండపురం గ్రామంలో బుధవారం 10 లక్షల రూపాయలతో సీసీ రోడ్ నిర్మాణపనులతో శంకుస్థాపన చేసారు మరియు

పెద్ద అడిశర్లపల్లి మండలంలోని రంగారెడ్డిగూడెం, మేడారం గ్రామాలలో చీ=+జూ నిధుల నుండి మంజూరైన 10.00 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న మహిళా సమాఖ్య సంఘ భవన నిర్మాణ పనులకు అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేసిన దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్. అనంతరం

అంగడిపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన




ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, ఇంటి యజమానికి శుభాకాంక్షలు తెలియజేశారు. తిరుమలగిరి గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును అధికారులతో కలిసి ప్రారంభించారు. పిల్లిగుండ్ల తండా, రాంపురం గ్రామాలలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు అధికారులు,ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేయడం జరిగింది.తిరుమలగిరి గ్రామంలో ఇటీవల మరణించిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అంతిరెడ్డి గారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పరచడమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.సీసీ రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యత పాటించాలని అధికారులకు సూచించి, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.మహిళా సమాఖ్య సంఘ భవనం మహిళా సంఘాల కార్యకలాపాలకు ఈ భవనం ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు.మహిళల సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా మరింత బలపడాలని ఆయన అన్నారు.గ్రామ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ, ఈ భవనం ద్వారా మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు మరియు ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహించడానికి అనుకూలంగా ఉంటుందని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం పేదలకు గౌరవప్రదమైన జీవనం కల్పించేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు.

అర్హులైన ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపే ఈ పథకం ద్వారా అనేక కుటుంబాల సొంతింటి కల సాకారం అవుతుందని తెలిపారు.కొత్త ఇంటిలో లబ్ధిదారులు ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలని ఎమ్మెల్యే గారు ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మండల ముఖ్య నాయకులు,మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని హోటళ్ల తనిఖీ

**అపరిశుభ్రంగా ఉన్న హోటళ్లకు జరిమానా విధించిన కమిషనర్**



**మేడ్చల్, అక్షిత ప్రతినిధి :** హోటల్ యాజమాన్యాలు పరిశుభ్రత పాటించకుంటే హోటళ్లపై చర్యలు తీసుకుంటామని అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ హెచ్చరించారు. ప్రజాపాలన – ప్రగతి పాలన లో భాగంగా అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో మున్సిపల్ ఛైర్ పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డిలతో కలిసి కమిషనర్ చంద్రశేఖర్ పర్యటించారు. పలు వార్డుల్లో పరిశుభ్రతలో భాగంగా శ్రమదానం చేశారు. అదేవిదంగా పలు గ్రామాల్లోని హోటళ్ల ను తనిఖీ చేశారు. అలియాబాద్ మున్సిపల్ తుర్కపల్లి పరిధిలోని 2 హోటళ్ల కు, మజీద్ పూర్ లోని 1 హోటల్ కు 30వేల జరిమానా విధించడం జరిగిందని కమిషనర్ చంద్రశేఖర్ తెలిపారు. హోటల్స్ ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉండకపోతే హోటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఛైర్ పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, ఇంచార్జీ ఆర్ఓ వేణుగోపాల్, ఇంచార్జీ ఆర్ఐ విజయ్ కుమార్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## బాలల సంక్షేమం మరియు రక్షణ కమిటీ సమావేశం

**బాలల హక్కులు కాపాడేందుకు కృషి చేయాలి**

**గ్రామ సర్పంచ్ అతినారపు శివకుమార్**



**అచంపేట్ అక్షిత ప్రతినిధి:** లింగాల మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో కోనేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి గ్రామ సర్పంచ్ అతినారపు శివకుమార్ అధ్యక్షతన బాలల సంక్షేమం మరియు రక్షణ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది, ఈ సందర్భంగా గ్రామంలోని పిల్లలందరూ పాఠశాల లో చదువుకోవాలని . బాల్య వివాహాలు చేయరాదని. పిల్లల అక్రమ రవాలను అరికడదాం. పిల్లలపై లైంగిక వేధింపులు అరికడదాం, అనే అంశాలపై చర్చించడం జరిగింది. ఎక్కడైనా పిల్లలపై వేధింపులు చేస్తే చట్టపరమైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రేమ్. వెలుగు సిసి రూప్సింగ్.కోనేరు స్వచ్ఛంద సంస్థ ఏరియా కోఆర్డినేటర్ శ్రీనివాస్. వి బి కే వెంకటేష్. గ్రామ మహిళా సంగం అధ్యక్షురాలు. ఆశ కార్యకర్త మంజుల. అంగన్వాడి కార్యకర్త పుష్పలత. వార్డు సభ్యులు ఈశ్వరమ్మ. లక్ష్మి. తోపాటు మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.